

రేపు జాబ్‌మేళా

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ఈనెల పదో తేదీన శ్రీకాకుళం డిఎల్‌టిసి (ఐటిఐ)లో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు అసిస్టెంట్ డైరెక్టర్ వై.రామ్మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. డిప్లమో మెకానికల్, ఐటిఐ ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, ఎంఎస్‌సి కెమిస్ట్రీ, బిఎస్‌సి కెమిస్ట్రీ, బిఎ, బికాం, ఇంటర్మీడియట్ 2022 నుంచి 2025 మధ్య ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని తెలిపారు. అభ్యర్థుల వయసు 26 ఏళ్లలోపు ఉండాలని పేర్కొన్నారు. ఆధార్, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని సూచించారు. హెట్రో డ్రగ్స్ ఈ ఇంటర్వ్యూలు నిర్వహిస్తుందని తెలిపారు.



సమ్మెకు సై

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సకల రంగాలకు చెందిన కార్మికులు బుధవారం చేపట్టనున్న సార్వత్రిక సమ్మెకు సమాయత్తమవుతున్నారు. శ్రమజీవులకు మద్దతుగా రైతులు, వ్యవసాయ కార్మికులు భాగస్వామ్యమవుతున్నారు. సార్వత్రిక సమ్మె జయప్రదానికి ఇప్పటికే కార్మిక సంఘాలు అన్నిరకాల సన్నాహాలు పూర్తి చేశాయి. ప్రభుత్వ అధికారులు, ప్రయివేట్ యాజమాన్యాలకు సమ్మె నోటీసులు ఇచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలతో ఆయా రంగాల కార్మికులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై కరపత్రాలను ప్రచురించి విస్తృతంగా పంపిణీ చేశారు. వీటితోపాటు జనరల్‌బాడీ సమావేశాలు, గేట్ మీటింగ్‌లు నిర్వహించి సమ్మె ప్రాధాన్యతను కార్మికులకు వివరించారు. సమ్మె జయప్రదం కోసం మోటారు సైకిళ్ల ర్యాలీలు నిర్వహించారు. సమ్మెలో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండలాల్లో ప్రదర్శనలు, సభలు నిర్వహించాలని నిర్ణయించారు. సమ్మెకు మద్దతుగా సిపిఎం, సిపిఐ, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ ప్రదర్శనలో పాల్గొన్నాయి.

- నేడు అఖిల భారత సమ్మె
- పిలుపునిచ్చిన కేంద్ర కార్మిక సంఘాలు
- సకల రంగ కార్మికులు, రైతులు భాగస్వామ్యం
- అన్ని మండలాల్లో ప్రదర్శనలు, సభలు
- సమ్మెకు వామపక్షాల మద్దతు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులపై దాడిని తీవ్రతరం చేసింది. లేబర్ కోడ్‌లతో కార్మికుల హక్కులను కాలరాయాలని చూస్తోంది. కార్మికుల త్యాగాలు, ఏళ్ల తరబడి సాగించిన పోరాటాలు ఫలితంగా సాధించుకున్న చట్టాలను మోడీ సర్కారు చాప చుట్టేసేందుకు సిద్ధమవుతోంది. కార్మికులను, వారి హక్కులను హరించే చట్టాన్ని తీసుకొచ్చే లక్ష్యంతో రూపొందించడంతో కార్మికుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. పరిశ్రమల్లో ట్రేడ్ యూనియన్ లేని పరిస్థితిని కల్పిస్తోందని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు 300 అంతకంటే ఎక్కువ మంది కార్మికులు పనిచేసే పరిశ్రమల్లో ముందస్తు అనుమతి లేకుండా లే ఆఫ్ గానీ లాకౌట్ గానీ చేసే అధికారం యజమానికి ఉండేది కాదు. ప్రస్తుతం ముందస్తు అనుమతి అవసరం లేదు. జిల్లాలో ఉన్న లక్షమంది కార్మికులపై ఇది ప్రభావం చూపనుంది. కార్మిక చట్టాలు అమల్లో ఉన్న సమయంలోనే యాజమాన్యాలు మొండిగా వ్యవహరిస్తున్న సందర్భాలు అనేకం ఉన్నాయి. ఉదాహరణకు గతేడాది రణస్థలం మండలం శ్యామ్‌పిస్టన్స్ ప్లాంట్-2లో 30 ఏళ్లు పూర్తయిన కార్మికులను తొలగించేందుకు యాజమాన్యం ప్రయత్నించింది. నాగార్జున అగ్రికెమ్ పరిశ్రమలో వేతన ఒప్పందానికి సిఐటియు ఆధ్వర్యాన కార్మికులు చేపట్టిన ఆందోళన తర్వాతే యాజమాన్యం అంగీకరించింది. యునైటెడ్ బేవరేజెస్‌లో కార్మికులకు 13 రోజుల పని కల్పిస్తున్న నేపథ్యంలో సిఐటియు చేసిన ఆందోళన ఫలితంగానే పూర్తిస్థాయి పనిదినాలు కల్పించింది. లేబర్ కోడ్‌లు అమల్లోకి వస్తే కార్మికులకు కఠిన పరిస్థితులు ఉత్పన్నం కానున్నాయి.

విసిగి వేశారిన స్కీమ్‌వర్కర్లు

కేంద్ర ప్రభుత్వ పథకాల్లో పనిచేస్తున్న అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన కార్మికులు, ఆశా తదితర స్కీమ్ వర్కర్లు ఏళ్ల తరబడి పనిచేస్తున్నా, గొర్రె తోక బెత్తెడు అన్న చందంగా వారి వేతనాలు ఉన్నాయి. జిల్లాలో సుమారు 18 వేల మంది స్కీమ్ వర్కర్లు పనిచేస్తున్నారు. వారిలో అంగన్‌వాడీలు 3,300 వరకు ఉన్నారు. అంగన్‌వాడీ వర్కర్‌కు రూ.11,500, మినీ అంగన్‌వాడీ వర్కర్‌కు, హెల్పర్‌కు రూ.ఏడు వేలు చొప్పున చెల్లిస్తోంది. తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీసం వేతనం రూ.26 వేలు చెల్లింపు వంటి డిమాండ్లతో పలురూపాల్లో ఆందోళనలు చేస్తూనే ఉన్నారు. వైద్యారోగ్యశాఖలో రాత్రనక, పగలనక సేవలందిస్తున్న ఆశాలకు అన్నీ కలిపి ప్రభుత్వం రూ.పది వేలు మాత్రమే అందిస్తోంది. కనీస వేతనం రూ.26 వేలు, చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని వీరు డిమాండ్ చేస్తున్నారు. మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులకు కేవలం రూ.మూడు వేలు గౌరవ వేతనంతో సరిపెడుతోంది. కనీస వేతనం రూ.26 వేలు, ఒక్కో విద్యార్థికి మెనూ ఛార్జీల కింద రూ.20 చెల్లింపు తదితర డిమాండ్లను ప్రభుత్వం ముందుంచారు.

కేంద్ర ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణ

కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణకు ప్రయత్నిస్తోంది. పెట్టుబడులను ఉపసంహరించుకునే ప్రయత్నాలు మొదలుపెట్టింది. వీటిలో ప్రధానంగా విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ ప్రయత్నాలను ముమ్మరం చేసింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలైన బిఎస్ఎన్ఎల్, ఎల్ఐసి, బ్యాంకింగ్, తదితర ఉద్యోగులు సమ్మెలో భాగస్వామ్యమవుతున్నారు. పెన్షనర్లకూ నష్టం కలిగించేలా కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఓల్డ్ పెన్షన్ స్కీమ్ స్థానంలో యూనిఫైడ్ పెన్షన్ విధానం తీసుకురావడాన్ని నిరసిస్తూ వారూ భాగస్వామ్యమవుతున్నారు.

సమ్మెలోకి సకల రంగ కార్మికులు

సమ్మెలో పారిశ్రామికరంగ కార్మికులు, స్కీమ్ వర్కర్లతో పాటు అన్ని రకాల కార్మికులూ సమ్మెలో పాల్గొంటున్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, ఆప్కాస్ రద్దు చేయాలనే ఆలోచనను విరమించుకోవాలని మున్సిపల్ కార్మికులు, ఉద్యోగులు ప్రభుత్వం ముందు డిమాండ్ ఉంచారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని కోరుతున్నారు. ట్రాన్స్‌పోర్టు కార్మికులకు ఉరితాడుగా ఉన్న బిఎన్ఎన్ (హిట్ అండ్ రన్) సెక్షన్ 106(1)(2) చట్టాన్ని రద్దు చేయాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. ఇలా అన్ని రంగాల కార్మికులు లేబర్ కోడ్‌ల రద్దుతో పాటు తమకు సంబంధించిన డిమాండ్లతో సమ్మెలోకి దిగుతున్నారు.

నేడు శ్రీకాకుళం నగరంలో భారీ ప్రదర్శన

సార్వత్రిక సమ్మెలో భాగంగా బుధవారం ఉదయం తొమ్మిది గంటలకు శ్రీకాకుళం నగరంలోని డైమండ్ పార్కు నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు కార్మికులు భారీ ప్రదర్శన నిర్వహించనున్నారు.



సమ్మె సన్నాహకంగా సోంపేటలో నిర్వహిస్తున్న బైక్ ర్యాలీ



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

- ప్రతి బుధవారం నీటి నాణ్యతా పరీక్షలు
- ప్రతి శుక్రవారం డ్రై డే
- మెగా పేరెంట్స్ మీట్‌ను విజయవంతం చేయాలి
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి జిల్లా, మండల స్థాయి అధికారులతో మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ప్రతి బుధవారం నీటి నాణ్యత పరీక్షలు చేయాలని, ప్రతి శుక్రవారం డ్రై డే పేరుతో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. పాఠశాలలు, ప్రజా నీటి కుళాయిల వద్ద నీటి నాణ్యతను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. గిరిజన ప్రాంతాలు, బిసి, ఎస్‌సి హాస్టళ్లలో ప్రత్యేక శుభ్రతా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రజల ఆరోగ్యంపై ఎటువంటి నిర్లక్ష్యానికి తావు లేదన్నారు. దోమల నియంత్రణ చర్యలు గ్రామస్థాయిలో మరింత పటిష్టం చేయాలని ఆదేశించారు.

జిల్లాలో ఈనెల పదో తేదీన అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో మెగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. బుధవారం ఉదయం ప్రతి ప్రభుత్వ ఉద్యోగి కనీసం ఐదు ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులను ఈ సమావేశానికి ఆహ్వానం పలకాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్‌పై అభిప్రాయాలు, పిల్లల ఆశయాలు ఒక పేరాలో రాసి సమావేశానికి తీసుకురావాలని సూచించారు.

ఉపాధి హామీలో నీటిని నిల్వ చేసే గుంతల పనులను వేగంగా పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో అలస్యమైతే చర్యలు తప్పవని హెచ్చరించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, ప్రత్యేక ఉప కలెక్టర్లు బి.పద్మావతి, జయదేవి తదితరులు పాల్గొన్నారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి

ప్రజాశక్తి - గార

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు సూచించారు. మండలంలోని అంపోలులో గల జిల్లా జైలును మంగళవారం పరిశీలించారు. ముద్దాయిలకు అందిస్తున్న ఆహార నాణ్యతను పరిశీలించారు. ఎటువంటి విభేదాలను చూపకుండా వైద్యాన్ని అందించాలని సూచించారు. ముద్దాయిలకు సంబంధించి ఆరోగ్య, ఆహార, పరిశుభ్రత, తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. న్యాయవాదిని నియమించుకునే స్తోమత లేని వారికి న్యాయసేవాధికార సంస్థ న్యాయవాదిని నియమిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ జి.మధుబాబు, జైలర్ దివాకర్ నాయుడు, చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ కె.ఆఫీసు, పి.అంజనీ కుమార్, జైలు సిబ్బంది, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ముద్దాయిలతో మాట్లాడుతున్న హరిబాబు

అన్నీ చెల్లించాకే ఊరు ఖాళీ చేస్తాం

ఆర్‌డిఒకు తేల్చిచెప్పిన మూలపేట నిర్వాసితులు

ప్రజాశక్తి - సంతబొమ్మాళి

తమకు రావాల్సిన నష్టపరిహారం రూపాయితో సహా చెల్లించిన తర్వాతనే ఊరు ఖాళీ చేస్తామని మూలపేట నిర్వాసితులు తేల్చిచెప్పారు. మండలంలోని మూలపేటలో పోర్టు నిర్వాసితుల సమస్యలు తెలుసుకునేందుకు టెక్కలి ఆర్‌డిఒ కృష్ణమూర్తి మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాసితులు మాట్లాడుతూ పిడిఎఫ్ అందజేయలేదని, రైతులకు నష్టపరిహారం చెల్లించాలని, ఆర్మీ ఉద్యోగులకు పరిహారం పూర్తిగా ఇవ్వలేదని తెలిపారు. జీడి మొక్కలకు పరిహారం, డాబా, రేకు ఇళ్లకు విలువ ప్రకారం పరిహారం అందజేయలేదని వివరించారు. సర్పంచ్ బాబూరావు మాట్లాడుతూ తాత తండ్రుల నుంచి సహజ వనరులు, సముద్రం, తంపరలో దొరికే మత్స్య సంపదతో జీవించామన్నారు. వేరే చోటుకు వెళ్లిపోతుండడంతో జీవనోపాధి కోల్పోతామని ఆర్‌డిఒ దృష్టికి తీసుకెళ్లారు. నిర్వాసితులకు పోర్టులోనే ఉపాధి కల్పించాలని కోరారు. సమస్యలు విన్న ఆర్‌డిఒ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. సమావేశంలో కూటమి నాయకులు జీరు భీమారావు, నారం నాయుడు, జీరు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



నిర్వాసితులతో మాట్లాడుతున్న ఆర్‌డిఒ కృష్ణమూర్తి

వైసిపి కనుమరుగు ఖాయం

ఎమ్మెల్యే కూన రవికుమార్

ప్రజాశక్తి - ఆమదాలవలస

మహిళల ఆగ్రహ జ్వాలతో వైసిపి కనుమరుగు కావడం ఖాయమని ఎమ్మెల్యే, పియుసి చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నెల్లూరు జిల్లాలో మహిళా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డిపై వైసిపి మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు మహిళా లోకం సిగ్గుపడే విధంగా ఉందన్నారు. నిండు శాసనసభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భార్య భువనేశ్వరిపై విమర్శలు చేసినప్పుడు గానీ, ఇప్పుడు గానీ ఆ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి కనీసం ఖండించకపోవడం దుర్మార్గమన్నారు. వైసిపి నాయకుల తీరుతో గత ఎన్నికల్లో ఆ పార్టీకి కనీసం ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వకుండా ప్రజలు బుద్ధి చెప్పినా వారి తీరు మారలేదన్నారు.

ఒకవైపు టిడిపి కూటమి ప్రభుత్వం మహిళల సాధికారితకు పెద్దపీట వేస్తుంటే, వైసిపి నాయకులు వారి మనోభావాలను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా వారు తీరు మార్చుకోవాలని సూచించారు. సమావేశంలో నియోజకవర్గ పరిశీలకులు తాడిబోయిన చంద్రశేఖర్ యాదవ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

మా కాలేజ్ గ్రౌండ్ మాకు కావాలి

- తహశీల్దార్ కార్యాలయం వద్ద విద్యార్థుల ధర్నా
- ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే కబ్జా
- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు పి.రామ్మోహన్

ప్రజాశక్తి - జి.సిగడాం

కబ్జాకు గురైన కళాశాల మైదానాన్ని స్వాధీనం చేసుకొని, తమకు ఇప్పించాలని కోరుతూ జి.సిగడాం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన తహశీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు పి.రామ్మోహన్ మాట్లాడుతూ 2012లో ప్రభుత్వ జూనియర్ కళాశాలను నిర్మించారని, ఆ సమయంలో గ్రామంలోని ఓ భూస్వామి విద్యార్థులకు ఆటస్థలం కోసం ప్రభుత్వానికి స్థలం ఇచ్చారని తెలిపారు. ఆ స్థలాన్ని రాజకీయ పలుకుబడి ఉన్న ఒక వ్యక్తి 2014లో కబ్జా చేశారని తెలిపారు. దీనిపై కోర్టుకు వెళ్తే 2018లో ఆ స్థలాన్ని కళాశాలకు కేటాయిస్తూ జిల్లా కోర్టు, లోక్ అదాలత్ తీర్పునిచ్చిందన్నారు. అయినా సరే ఆ స్థలం తనదే అంటూ సదరు వ్యక్తి కోర్టు ఆదేశాలను ధిక్కరిస్తూ గడ్డి కుప్పలు, తదితరాలు వేసి వాడుకుంటున్నారని చెప్పారు. ప్రభుత్వం చొరవ తీసుకొని కళాశాల ఆట స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే విద్యార్థులు, సమీప గ్రామాల ప్రజలను సమీకరించి ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహశీల్దార్, ఎస్ఐకి వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.చందు, సహాయ కార్యదర్శి పి.గణేష్, జిల్లా కమిటీ సభ్యులు జయరాం, టౌన్ కమిటీ సభ్యులు రవి, కళాశాల విద్యార్థులు, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

జిల్లాలో బెంతుఒరియాలు లేరు

ప్రజాశక్తి - పలాస

జిల్లాలో బెంతుఒరియా తెగ లేదని, ఇందుకు చారిత్రక ఆధారాలు ఉన్నాయని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబ యోగి తెలిపారు. వడ్డి సామాజిక తరగతికి చెందిన వారు బెంతు ఒరియా తెగగా చెప్పుకుంటూ గిరిజన కుల ధ్రువీకరణ పత్రాల కోసం అడ్డదారులు తొక్కుతున్నారని ఆరోపించారు. పట్టణంలోని ఒక హోటల్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పలాస రెవెన్యూ డివిజన్ పరిధిలోని కంచిలి, కవిటి మండలాల్లోని బిసి-ఎకు చెందిన వడ్డి సామాజిక తరగతి వారు తాము బెంతు ఒరియా తెగ అని చెప్పుకుంటూ గిరిజన కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని కొందరు విద్యార్థులు హైకోర్టును ఆశ్రయించారని తెలిపారు. వారికి ఇంటిగ్రేటెడ్ కోర్స్ విద్య పూర్తయ్యే వరకు వర్తించే విధంగా గిరిజన కుల ధ్రువీకరణ పత్రం ఇవ్వాలని కోర్టు ఆదేశాలు ఇచ్చిందన్నారు. దాన్ని ఆసరాగా చేసుకొని తమను గిరిజనులుగా గుర్తించాలని, కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని ఆందోళనలు చేయడం, రాజకీయ పార్టీ నేతలను కలిసి రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. బెంతు ఒరియాల పేరుతో చలామణి అవుతూ అటు ప్రభుత్వాన్ని, ఇటు న్యాయస్థానాలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. 1977లో శ్రీకాకుళం నుంచి విజయనగరం వేరుపడినప్పుడు ఇప్పుడున్న మన్యం జిల్లాలోని కొన్ని గ్రామాల్లో బెంతు ఒరియా తెగ ఉంది తప్ప శ్రీకాకుళం జిల్లాలో లేదని స్పష్టం చేశారు. ఇప్పటివరకు ఇచ్చిన నకిలీ కుల ధ్రువపత్రాలపై దర్యాప్తు చేసి చర్యలు తీసుకోవాలని, వాటన్నింటినీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజనేతరులకు ఎస్‌టి ధ్రువీకరణ పత్రాలు ఇస్తే గిరిజనుల ప్రతిఘటనను చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం ఆర్‌డిఒ వెంకటేష్‌కు వినతిపత్రం అందజేశారు. సమావేశంలో జిల్లా జెఎసి కన్వీనర్ సవర రాంబాబు, ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబ యోగి

ప్రాథమికోన్నత పాఠశాలను కొనసాగించాలి

ప్రజాశక్తి - బూర్జ

అల్లిన ప్రాథమికోన్నత పాఠశాలను కొనసాగించాలని గ్రామస్తులు జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్యను కోరారు. మండలంలో అల్లిన పాఠశాలను డిఇఒ మంగళవారం సందర్శించారు. ఈ పాఠశాలలో 6, 7, 8 తరగతులు చదువుతున్న విద్యార్థులు 29 మంది ఉన్నా, విద్యార్థులు తక్కువగా ఉన్నారని ప్రాథమిక పాఠశాలగా మార్చారని గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీంతో విద్యార్థులను అటు పాలకొండ ఇటు పాలవలస హైస్కూళ్లకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రాథమికోన్నత పాఠశాల కొనసాగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై డిఇఒ స్పందిస్తూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం విద్యార్థుల శాతం తక్కువ ఉన్న ఈ పాఠశాలను యుపి పాఠశాలగా కొనసాగించడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. విద్యార్థులకు వారు కోరిన హైస్కూల్‌లో చదువుకునేలా రవాణా సౌకర్యం కల్పిస్తామన్నారు. అంతకుముందు డిఇఒ విద్యార్థులతో మాట్లాడారు తెలుగు, ఇంగ్లీష్, హిందీ, లెక్కల సబ్జెక్టులపై ప్రశ్నలు వేశారు. విద్యార్థులు వాటికి సమాధానాలు చెప్పడంపై సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులకు అందజేస్తున్న ఆహార పదార్థాలను స్వయంగా పరిశీలించి, రుచి చూశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ప్రతినిధి జడ్డు మహేశ్వరరావు, స్కూల్ కమిటీ చైర్మన్ శంకర్రావు, టిడిపి సోషల్ మీడియా అధ్యక్షులు వారాడ రాంబాబు, పొగిరి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.




డిఇఒకు సమస్యను వివరిస్తున్న గ్రామస్తులు

ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్ డ్రైవ్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

విద్యాసంస్థల పరిసరాల్లో నిషేధిత గంజాయి, పొగాకు ఉత్పత్తులు క్రయ విక్రయాలు చేసిన వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి హెచ్చరించారు. మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్ కార్యక్రమంలో భాగంగా జిల్లావ్యాప్తంగా అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో పోలీసు అధికారులు, సిబ్బంది, ఈగల్ టీమ్ పోలీస్ సిబ్బంది, రెవెన్యూ, ఇతర శాఖల సమన్వయంతో పాఠశాలలు, కళాశాలకు వంద మీటర్ల దూరంలో ఉన్న కిరాణా షాపుల్లో సిగరెట్, ఖైనీ, గుట్కా గంజాయి తదితర ఉత్పత్తులు అమ్మకాలు చేయకూడదని స్పెషల్ డ్రైవ్ మంగళవారం చేపట్టారు. ఐదు రోజుల పాటు సాగే ఈ డ్రైవ్‌లో జిల్లావ్యాప్తంగా కళాశాలలు, పాఠశాలల పరిధిలో తనిఖీలు చేపడతారు. డ్రైవ్‌లో భాగంగా అనుమానిత కిరాణా షాపులు, బడ్డీ కొట్లు, కిళ్లీ షాపులపై ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. మాదకద్రవ్యాలపై కఠిన చర్యలతో పాటు విద్యార్థులకు, స్థానిక ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహించారు. నిషేధిత పొగాకు ఉత్పత్తుల విక్రయం, నిల్వ, రవాణాపై సిగరెట్లు, ఇతర పొగాకు ఉత్పత్తుల నిషేధ చట్టం ప్రకారం ప్రత్యేక డ్రైవ్ లో అమ్మకాలు నిర్వహించిన షాపులకు మొదటి దశలో జరిమానాలు విధిస్తామని తెలిపారు. తర్వాత దశలో అమ్మకాలు నిర్వహించిన వారిపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పొగాకు ఉత్పత్తులు, గంజాయి ఉచ్చు నుంచి యువతను రక్షించడం అందరి సామాజిక బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో సిఐలు, ఎస్ఐలు, ఈగల్ టీం సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



దుకాణాల్లో తనిఖీ చేస్తున్న పోలీసులు

చంద్రబాబు మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్

ప్రజాశక్తి - రణస్థలం

టిడిపి కూటమి ప్రభుత్వ మోసాలు, వంచనను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ' కార్యక్రమంపై సన్నాహక సమావేశాన్ని మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అధ్యక్షతన రణస్థలం మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణదాస్ మాట్లాడుతూ అధికారం చేపట్టి ఏడాది గడిచినా హామీలను అమలు చేయకుండా చంద్రబాబు డైవర్షన్ రాజకీయాలకు తెరలేపారని విమర్శించారు. హామీలపై నిలదీసిన వారిని అక్రమ కేసులతో వేధిస్తున్నారని చెప్పారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని చెలరేగిపోతున్నారని, వారు బెదిరిస్తే బెదిరిపోవడానికి సిద్ధంగా లేమన్నారు. ప్రతిపక్షంగా ప్రజల గొంతుకను వినిపిస్తూనే ఉంటామన్నారు. ప్రతి మండలంలో 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని నిర్వహిస్తూ, ప్రజల ఎదుట చంద్రబాబు పాలనలో మోసాలను తెలియజేసే విధంగా ప్రణాళిక రూపొందిస్తున్నామని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ మాట్లాడుతూ ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని భరోసానిచ్చారు. కార్యకర్తలు పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని చంద్రబాబు మోసాన్ని ప్రజలకు వివరిస్తూ, జగన్మోహన్ రెడ్డి తిరిగి ముఖ్యమంత్రి అయ్యే వరకు శ్రమించాలని పిలుపునిచ్చారు. అనంతరం పలు పంచాయతీలకు చెందిన జనసేనకు చెందిన 40 కుటుంబాల నాయకులు, కార్యకర్తలు వైసిపిలో చేరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎచ్చెర్ల నియోజకవర్గ పార్టీ మండల అధ్యక్షులు, ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షులు కృష్ణదాస్



తడి, పొడి చెత్తలపై అవగాహన కల్పిస్తున్న భారతీసౌజన్య

ఆదాయ వనరులుగా చెత్త సంపద కేంద్రాలు

ప్రజాశక్తి - పొందూరు

గ్రామ పంచాయతీలు చెత్త సంపద తయారీ కేంద్రాలను ఆదాయ వనరులుగా మార్చుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి కె.భారతీ సౌజన్య అన్నారు. మండలంలోని తండ్యాం పంచాయతీని మంగళవారం ఆమె సందర్శించి గ్రామంలో చేపడుతున్న చెత్త సేకరణను పరిశీలించారు. తడి, పొడి చెత్తలను సేకరించి వాటిని సారవంతమైన ఎరువుగా మార్చి రైతులకు విక్రయించడం ద్వారా స్థిరమైన ఆదాయాన్ని పంచాయతీలు పొందవచ్చన్నారు. ఇంటింటికి వెళ్లి ఐవీఆర్ఎస్ కాల్స్, తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎ.మన్మథరావు, డిప్యూటీ ఎంపిడిఒ పి.సింహాచలం, సర్పంచ్ ప్రతినిధి కిల్లారి భాస్కరరావు, కార్యదర్శి శంకరరావు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామారావు

ప్రజలకు అవగాహన కల్పించాలి


ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

బాబూ ష్యూరిటీ-మోసం గ్యారెంటీపై ప్రతి గడపకు వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ అన్నారు. మంగళవారం స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో మండలం, మున్సిపాలిటీ మండల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో చంద్రబాబు చేస్తున్న మోసాన్ని గుర్తుచేస్తూ ప్రసంగించారు. మండల స్థాయిలో, గ్రామాల్లో వైసిపి నాయకులు, కార్యకర్తలు ప్రతి గడపకు చేరి స్కానర్ ద్వారా 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ' ప్రోగ్రామ్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి, ఎంపిపి బోర పుష్ప, శ్యామ్ ప్రసాద్ రెడ్డి, కడియాల ప్రకాష్, ప్రకాశరావు పట్నాయక్, పాతర్ల రాజశేఖర్ రెడ్డి, నర్తు ప్రేమ్ కుమార్, భారతీ దివ్య, లాభాల స్వర్ణమణి, ఇప్పిలి కృష్ణారావు, దేవదాసు రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కోర్టు ఆదేశాలకు విలువ లేదా?

బెంతు ఒరియా విద్యార్థి ఆవేదన

ప్రజాశక్తి - కవిటి



నరేష్ బిసాయి

పదో తరగతిలో 575 మార్కులు సాధించి ఇటీవల జరిగిన ట్రిపుల్ ఐటి కౌన్సిలింగ్‌లో నూజివీడులో సీటు పొందిన బొరివంక గ్రామానికి చెందిన బెంతు ఒరియా విద్యార్థి నరేష్ బిసాయికి కుల ధ్రువీకరణ పత్రం లేకపోవడంతో సంబంధిత యాజమాన్యం సీటు నిరాకరించింది. దీంతో నరేష్ కోర్టును ఆశ్రయిస్తే అతని చదువుకి ఇబ్బంది లేకుండా కుల ధ్రువీకరణ పత్రం మంజూరు చేయాలని కోర్టు ఆదేశించింది. అంతేకాకుండా ఆ ధ్రువీకరణ పత్రం కేవలం చదువుకి మాత్రమే ఉపయోగించాలని స్పష్టం చేసింది. దీంతో కోర్టు ఉత్తర్వులు పట్టుకుని పలాస ఆర్‌డిఒ వెంకటేష్ దగ్గరకు వెళ్లిన నరేష్‌కు నిరాశే మిగిలింది. ఈ విషయంలో తాను ఏమి చేయలేనని ఆయన చెప్పడంతో నరేష్ కలెక్టర్ వద్దకు కూడా వెళ్లి తన సమస్య మొరపెట్టుకున్నారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ దేశంలో ధర్మం, న్యాయాన్ని పరిరక్షించే కోర్టు ఇచ్చిన ఉత్తర్వులకు కూడా విలువ లేదని చెప్పే సంఘటన ఇదని ఆవేదన వ్యక్తం చేశారు. తన తల్లిదండ్రులు కూలిపనులు చేసుకుంటూ తనను చదివించారని, తాను ఉన్నత చదువులు చదవాలని కష్టపడి చదివితే అధికారుల తీరుతో తన కలలు నిర్వీర్యమయ్యే ప్రమాదం ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. చదువే తనకు దిక్కని అది లేకపోతే ఉండలేనని, అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తనకు కుల ధ్రువీకరణ పత్రం అందించి తన చదువుకు సహకరించాలని చెమ్మగిల్లిన కళ్లతో వేడుకున్నాడు.

విద్యార్థులకు కిట్లు పంపిణీ



కిట్లు అందజేస్తున్న మాజీ సర్పంచ్ శ్రీనివాసరావు తదితరులు

లావేరు: విద్యాభివృద్ధికి కూటమి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందని తామాడ మాజీ సర్పంచ్ గొర్లె శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం తామాడ జెడ్పి పాఠశాలలో డా సర్వేపల్లి రాధాకృష్ణ కిట్స్ పంపిణీలో ఆయన పాల్గొని విద్యార్థులకు కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు మార్పు చేశారన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం సంజీవరావు, ఎస్ఎంసి చైర్మన్ చిన్నారావు, ఎం.దుర్గాప్రసాద్, కె.రాము, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి



పలాస : ప్రచారం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు



శ్రీకాకుళం సిటీ: నిరసనలో బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ యూనియన్ ప్రతినిధులు

ప్రజాశక్తి - రణస్థలం

కార్మిక హక్కులు కాలరాసే లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకై కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు 9న అఖిలభారత సమ్మె జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సి.హెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు పిలుపునిచ్చారు. మంగళవారం సమ్మె జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో పైడిభీమవరం పారిశ్రామిక వాడలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ బైక్ ర్యాలీని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు పైడిభీమవరం జంక్షన్ వద్ద ప్రారంభించారు. ఈ సందర్భగా వారు మాట్లాడుతూ 9న సమ్మెలో ఉద్యోగులు, కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. దశాబ్దాలు పాటు కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి మోడి నాయకత్వంలోని కేంద్ర బిజెపి ప్రభుత్వం పెట్టుబడిదారీ ప్రయోజనాల కోసం నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి వేసిందని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.వి.రమణ, శ్యాంపిస్టన్స్ యూనియన్ నాయకులు ఎం.అప్పలనర్సయ్య, ఎమ్.కూర్మారావు, జయరాం, డా.రెడ్డీస్ లేబొరేటరీస్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎం.ఈశ్వరరావు, పి.రామకృష్ణ, బి.సురేష్, సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : ఈ నెల 9న జరగనున్న సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలని సిపిఎం నాయకులు నంబూరి షణ్ముఖరావు అన్నారు. టెక్కలి మోటారు వర్కర్స్ యూనియన్ సభ్యులు బొంతల సోమయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ట్యాక్సీ డ్రైవర్లు సమ్మెకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో బొడ్డ కేశవ, శోభన, జె.తవిటయ్య, ఎన్.సోమేష్, భాస్కరరావు, కోదండ, గణేష్ పాల్గొన్నారు.

పలాస: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లేబర్ కోడ్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ చేపడుతున్న సమ్మెను విజయవంతం చేయాలని ప్రజా సంఘాలు, వామ పక్ష నాయకులు పిలుపునిచ్చారు. పలాస, కాశీబుగ్గ జంట పట్టణాల్లో సమ్మె విజయవంతం చేయాలని ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, ఎఐకెఎం నాయకులు మద్దిలి రామారావు, ఎఐసిసిటియు నాయకులు పి.నాగేశ్వరావు, కె.దుష్యంత్, పిడిఎస్‌యు నాయకులు ఎం.వినోద్ కుమార్, ప్రజా సంఘాల నాయకులు టి.అజయ్ కుమార్, సన్యాసిరావు, ఈశ్వరమ్మ, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



రణస్థలం : పారిశ్రామికవాడలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు

ఆమదాలవలస: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న నిరంకుశ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 9న జరుగనున్న సమ్మెలో పాల్గొని నిరసన తెలియజేయాలని సంఘ అధ్యక్ష కార్యదర్శులు సురవరపు సిమ్మి నాయుడు, బొడ్డేపల్లి జనార్ధన రావు ఒక ప్రకటనలో కోరారు. పెన్షనర్లు అందరూ పెద్ద ఎత్తున హాజరై ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

శ్రీకాకుళం సిటీ: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ విధానాలు, కార్మికులకు రక్షణ కల్పించే 29 కార్మిక చట్టాలను కాలరాచే 4 లేబరు కోడ్‌లు అమలు పరిచే నేపథ్యంలో 9న జరగనున్న అఖిల భారత సమ్మెకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధి తెలిపారు. సమ్మెకు మద్దతుగా నగరంలోని ఎల్ఐసి కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఎల్ఐసి కార్యాలయం శ్రీకాకుళం శాఖ ఆవరణలో ధర్నా, నిరసన కార్యక్రమం చేపట్టారు. ఎఐఐఇఎ, బిఇఎఫ్ఐ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బిఇఎఫ్ఐ నాయకులు మండ శ్రీనివాసరావు మాట్లాడుతూ సార్వత్రిక సమ్మెకు అన్ని వర్గాలు మద్దతునిస్తున్నాయన్నారు. విజయవంతం చేయాలని కోరారు కార్యక్రమంలో ఎల్ఐసి నాయకులు ఆచారి, సిఐటియు నాయకులు ప్రకాష్, బిఎస్ఎన్ఎల్ గోవర్ధన్, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

పొందూరు పిఎసిఎస్ చైర్మన్‌గా మురళీ

ప్రజాశక్తి - పొందూరు



మురళీ

పొందూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్‌గా మండలంలోని బురిడికంచరాంకు చెందిన వండాన మురళీని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు పిఎసిఎస్ సిఇఒ ఎర్నెన పాపినాయుడు తెలిపారు. పిఎసిఎస్ పర్సన్‌లుగా బాణాంకు చెందిన కింజరాపు వెంకట రమణ, తోలాపికి చెందిన దుంపల సత్యంను నియ మించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా చైర్మన్ మురళీ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్ప గించిన ఎమ్మెల్యే రవికుమార్‌కు, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ కోతలతో తీవ్ర ఇబ్బందులు

పలాస: కాశీబుగ్గ పారిశ్రామిక వాడలో జీడి పరిశ్రమలు ఉన్నాయని, ఎప్పటికప్పుడు విద్యుత్ సరఫరా కోతలతో వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కాశీబుగ్గ పారిశ్రామిక వాడ జీడి పరిశ్రమల సంఘం అధ్యక్షుడు మల్లా రామేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. పలాస విద్యుత్‌శాఖ కార్యాలయంలో ఇఇ జి.యజ్ఞేశ్వరరావుకు విద్యుత్ సరఫరా సమస్యను పరిష్కరించాలని మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సరఫరా ఎప్పటికప్పుడు అంతరాయం కలగడంతో వ్యాపార ఉత్పత్తులు ఆగిపోతున్నాయని, వేలాది కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్పందించి పారిశ్రామిక వాడలో విద్యుత్ సరఫరాకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. వినతిత్రం అందజేస్తున్న వారిలో కార్యదర్శి తూముల శ్రీనివాసరావు, కోశాధికారి కొంచాడ వినయ, ఉపాధ్యక్షులు తాళాసు శ్రీనివాసరావు, సభ్యులు జామి రామ, శాసనపురి పాండురంగారావు, బోయిన వెంకటరావు, సాన రాజు, తంగుడు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

బదిలీల్లో గందరగోళం

ప్రజాశక్తి - కవిటి



మురళీ ప్రకాష్

బదిలీ అయిన ఉపాధ్యాయులకు సంబంధించి జూన్ నెలకు సంబంధించిన జీతాల అరియర్ బిల్లులు ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నాయని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.మురళీ ప్రకాష్ అన్నారు. జూలై 6 నుంచి 10 వరకే బిల్లుల అప్లోడ్ గడువు ఉండగా, ఇప్పటికే రెండు రోజులు గడిచిపోయాయని, మిగిలిన మూడు రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తవుతుందా? అని ఆయన సందేహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రభుత్వం ఉపాధ్యాయులపై ఉన్న బాధ్యతను మరిచిపోయిందని, రోజుకో కార్యక్రమంతో గిన్నిస్ బుక్ రికార్డు సాధించాలనే తపనే తప్పా బదిలీ అయిన ఉపాధ్యాయుల జీతాలు సకాలంలో చెల్లించాలన్న ఆలోచన మాత్రం లేదని మండిపడ్డారు. ఇది తీవ్రంగా ఖండించదగ్గ విషయమన్నారు. గందరగోళం మధ్య బదిలీలు చేపట్టడంతో ఇప్పటికీ 50శాతం ఉపాధ్యాయులు రిలీవ్ కావడం లేదన్నారు. పాఠశాల ప్రారంభంలో విద్యార్థులకు అడ్మిషన్లు ఇవ్వాల్సిన సమయంలో యోగా అంటూ సగం కాలం కరిగిపోయిందని, ఇప్పుడు మెగా పేరెంట్స్ డే పేరుతో మరింత ఒత్తిడి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య ఎలా అందించాలని ప్రశ్నించారు. ఉపాధ్యాయుల సమస్యలు గుర్తించి బిల్లుల అప్లోడ్ గడువు తక్కువగా ఉండటంతో పరిష్కారం తక్షణమే చేపట్టాలని ఆయన కోరారు.

ఆయిల్‌పామ్ మెగా ప్లాంటేషన్ మేళా

ప్రజాశక్తి - మెళియాపుట్టి

మండలంలోని కుడ్డబలో మెగా ఆయిల్‌పామ్ ప్లాంటేషన్ మేళా ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉద్యానశాఖ సహాయ సంచాలకులు చిట్టిబాబు, మాజీ ఎంపిపి సలాన మోహనరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ ఉద్యానశాఖ పంటలపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుందని రాయితీలు కూడా గణనీయంగా పెంచిందని తెలిపారు. ఈ పథకాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని కోరారు. ఆయిల్ పామ్ సాగు కొరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకమైన రాయితీలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ ఆయిల్ పామ్ పంటను ఒక్క సారి నాటుకుంటే మూడు సంవత్సరాల తర్వాత కాపు ప్రారంభమై 30 సంవత్సరాల వరకు దిగుబడిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాస్ పామ్ ఆయిల్ జిల్లా కోఆర్డినేటర్ వీరబాబు, ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా, ఉద్యానశాఖ అధికారి శంకర్ దాస్, శరత్ కుమార్ రెడ్డి, షణ్ముఖరావు, త్రినాథరావు, నరేంద్ర కుమార్, ఫీల్డ్ ఆఫీసర్ ఈశ్వర్ రావు, టిడిపి మండల అధ్యక్షులు నంబాల వెంకటరావు, మండల యువత అధ్యక్షుడు బసవ పరమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

దుకాణాల్లో పోలీసుల తనిఖీలు



సోంపేట: పాన్‌షాపులో తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్ఐ లవరాజు, సిబ్బంది

ప్రజాశక్తి - పాతపట్నం

ఆపరేషన్ షేప్ జోన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పాన్‌షాపుల్లో మంగళవారం పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎస్ఐ బి.లావణ్య విద్యా సంస్థలకు దగ్గరలో సిగరెట్లు, గుట్కా ఇతర పొగాకు ఉత్పత్తులు అమ్మేవారికి హెచ్చరికలు జారీ చేశారు. 18 ఏళ్లలోపు వారికి పొగాకు ఉత్పత్తులు అమ్మినట్లయితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. డ్రగ్స్, గంజాయి, అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా తనిఖీలు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, స్కూల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

రణస్థలం: రణస్థలంలో పోలీసుల ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న పాన్‌షాపులను జె.ఆర్.పురం సిఐ ఎం.అవతారం, ఎస్ఐ ఎస్.చిరంజీవి ఆధ్వర్యంలో పోలీసులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. గుట్కా, తంబాకు, సిగరెట్, బీడీ వంటి నియంత్రణ చర్యల్లో భాగంగా పోలీసులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు.

లావేరు: లావేరు జెడ్పి పాఠశాల, జూనియర్ కళాశాలలకు సమీపంలోని దుకాణాల్లో ఎస్ఐ జి.లక్ష్మణరావు ఆధ్వర్యంలో సోదాలు చేపట్టారు. నాలుగు దుకాణాల్లో సిగరెట్లు, గుట్కాలు, పొగాకు సంబంధించిన మత్తుపదార్థాలను స్వాధీనం చేసుకొని వారికి జరిమానా విధించారు. ఈ తనిఖీల్లో సిబ్బంది భాస్కరరావు, చక్రధర్ ఉన్నారు.

టెక్కలి రూరల్ : మండలంలో ఉన్న ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో దుకాణాలను ఈగల్ టీం ఆధ్వర్యంలో సిఐ విజయ్ కుమార్ తమ సిబ్బందితో కలిసి ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. గంజాయి, మాదక ద్రవ్యాల నిల్వలపై దృష్టి సారించి ఈ సోదాలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఈగల్ టీం సభ్యులు పాల్గొన్నారు.

సోంపేట: పట్టణంలోని పాఠశాలల సమీపంలో ఉన్న పలు కిరాణా, పాన్‌షాపులను స్థానిక ఎస్ఐ లవరాజు ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈగల్ టీం సభ్యులు, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయుడు నగిరి మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

పలాస: మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని, మాదక ద్రవ్యాలు వాడడం ద్వారా ఆరోగ్యం పాడవుతుందని కాశీబుగ్గ డిఎస్‌పి వి.వెంకట అప్పారావు అన్నారు. కాశీబుగ్గలో పలు విద్యాసంస్థలు, పాన్‌షాప్‌ల వద్ద తనిఖీలు చేపట్టారు. ఈయనతో పాటు కాశీబుగ్గ సిఐ సూర్య నారాయణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: పట్టణంలో, మండలంలో సిఐ చిన్నంనాయుడు ఆధ్వర్యంలో రూరల్ ఎస్ఐ శ్రీనివాస్ పాన్‌షాపుల వద్ద తనిఖీలు నిర్వహించారు.

కవిటి: కవిటి పోలీస్ స్టేషన్ పరిధిలోని పాఠశాలలకు 100 మీటర్ల పరిధిలో ఎటువంటి మత్తు పదార్థాలు, సిగరెట్లు, గుట్కా వంటి ఉత్పత్తుల విక్రయాన్ని నిషేధించామని ఎస్ఐ తెలిపారు. పలు దుకాణాలు తనిఖీ చేశారు.

మెళియాపుట్టి : పాఠశాలలు, కళాశాలలు సమీపంలోని పలు దుకాణాల్లో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ పి.రమేష్‌బాబు, ఎఎస్ఐ బి.అప్పన్న, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

హత్య కేసు నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి - కొత్తూరు

మండలంలోని వనపకు చెందిన మిన్నారావు హత్య కేసులో నిందితుడిని పోలీసులు పట్టుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను సిఐ చింతాడ ప్రసాద్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో వివరించారు. మృతుడు మిన్నారావు, అదే గ్రామానికి చెందిన ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ యజమాని మలగాన శంకరరావుకు దుకాణం వద్ద ఇబ్బందులకు గురిచేసేవాడని తెలిపారు. ఎప్పట్లానే ఇబ్బంది పెడుతుంటే శంకరరావు తన వద్ద ఉన్న సుత్తితో మిన్నారావు తలపై బలంగా కొట్టాడని చెప్పారు. అనంతరం షాపులో ఉన్న చాకుతో పీకను కోసి దుకాణం ఎదురుగా రోడ్డు పక్కన పడేశాడని తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు తరలించనున్నట్లు చెప్పారు. సమావేశంలో ఎస్ఐ మహమ్మద్ అమీర్ ఆలీ, సిబ్బంది పాల్గొన్నారు.



ఆధారాలను సేకరిస్తున్న క్లూస్ టీమ్ సభ్యులు

24 తులాల బంగారం చోరీ

సోంపేట: కంచిలి రైల్వేస్టేషన్‌కు సమీపంలోని మెయిన్ రోడ్‌లో గల విశ్రాంత ఉపాధ్యాయుడు ఇంట్లో శనివారం రాత్రి దొంగలు పడి సుమారు 24 తులాల బంగారంతో పాటు ఒక కిలో వెండి ఆభరణాలు దోచుకెళ్లిన సంఘటన స్థానికంగా కలకలం రేపింది. ఈ మేరకు కంచిలి పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల మేరకు మెయిన్ రోడ్‌లో గల విశ్రాంత ఉపాధ్యాయుడు సింహాద్రి ప్రధాన్ శనివారం ఉదయం తన వియ్యంకుడిని కలవడానికి కుటుంబ సభ్యులతో కలిసి విశాఖపట్నం వెళ్లాడు. తన పెద్ద కుమారుడు జర్మనీ నుంచి స్వదేశానికి రావడంతో అతడిని కలిసేందుకు వియ్యంకుడి ఇంటికి వెళ్లాడు. ఆదివారం సాయంత్రం తన స్వగృహానికి తిరిగి వచ్చి చూసేసరికి ఇంటి ప్రధాన తలుపులు తెరిచి ఉండడంతో కంగారుగా లోపలికి వెళ్లి చూశాడు. ఇంటిలోని బీరువాలో గల 24 తులాల బంగారం, కిలో వెండి వస్తువులు దోచుకెళ్లినట్లు గుర్తించి బోరుమన్నాడు. సంఘటనపై బాధితుడు వెంటనే ఫిర్యాదు చేయకుండా చుట్టుపక్కల వారికి సమాచారాన్ని తెలియజేశాడు. స్థానికులు, కుటుంబ సభ్యుల సూచన మేరకు మంగళవారం ఉదయం కంచిలి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు అందిన వెంటనే సోంపేట సిఐ మంగరాజుతో పాటు ఎస్ఐ పారినాయుడు సంఘటనా స్థలాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించారు. పలాస క్లూస్‌టీమ్ వచ్చి ఆధారాలు సేకరించారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ప్రజలు బయట ఊర్లకు వెళ్లేటప్పుడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇస్తే గస్తీ ఏర్పాటు చేస్తామని, అప్పుడు ఇటువంటి దొంగతనాలు జరిగే అవకాశం ఉండదని ఎస్ఐ తెలిపారు.

5 కేజీల బంగారం పట్టివేత

రణస్థలం రూరల్: జె.ఆర్.పురం సిఐ అవతారం, ఎస్ఐ చిరంజీవి ఆధ్వర్యంలో పైడిభీమవరం చెక్ పోస్ట్ వద్ద సోమవారం రాత్రి కారులో ముగ్గురు వ్యక్తులు కె.శ్రీనివాసరావు, కె.రాజయ్య, కె. సూర్య వద్ద ఐదు కేజీల బంగారం ఆభరణాలు పట్టుకొని జిఎస్‌టి అసిస్టెంట్ కమిషనర్ వెంకటరమణ అప్పగించారు. రూ.5 కోట్లు ఆభరణాలను శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం తరలిస్తుండగా పోస్ట్ వద్ద పోలీసులు తనిఖీలో పట్టుబడింది. దీని విలువ ఐదు కోట్ల వరకు ఉంటుందని, ఆయన ఈ బంగారాన్ని జిఎస్‌టి అధికారులకు అప్పగించారు. దీనికి సంబంధించిన బిల్లును పరిశీలిస్తున్నట్లుగా వారు తెలిపారు.

నాటుసారా అరికట్టేందుకు చర్యలు

సోంపేట: నాటుసారాను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఎక్సైజ్ సిఐ జి.వి రమణ తెలిపారు. మంగళవారం స్టేషన్ సిబ్బందితో కంచిలి మండలం కుమ్మరిపేటలో దాడులు చేసి సాహుకారి కుమార్ అనే వ్యక్తి నుంచి 80 నాటుసారా ప్యాకెట్లు (8 లీటర్లు) తో పట్టుకొని, అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఈయనకు నాటుసారా సరఫరా చేసిన బొనమలి గ్రామానికి చెందిన జ్యోతియ లక్ష్మీపై కేసు నమోదు చేశామని తెలిపారు. పలాస టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో జలాంత్రకోట గ్రామ శివార్లలో దాడులు నిర్వహించి రత్నాల బైలోడు అనే వ్యక్తి నుంచి 200 నాటుసారా ప్యాకెట్లను (20 లీటర్లు) స్వాధీన పరచుకొని కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. నిందితులను సోంపేట కోర్టులో హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సిఐతో పాటు టాస్క్‌ఫోర్స్ సిఐ మధు కుమార్, సిబ్బంది భాను ప్రసాద్, మార్కారావు, ఉమాపతి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఇఒ

మెగా పేరెంట్స్ డేకు సన్నాహాలు

నందిగాం: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఈ నెల 10న జరగనున్న మెగా పేరెంట్స్ టీచర్స్ డే సన్నాహక సమావేశాన్ని ఎంపిడిఒ కుమార్ పట్నాయక్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నిశాఖల ఉద్యోగులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అధికారి ఇఇ శేఖరరావు పాల్గొని మాట్లాడుతూ అందరూ సమన్వయంతో కార్యక్రమాన్ని ముందుకు నడపాలన్నారు. మండల విద్యాశాఖ అధికారులు జి.నరసింహులు, ఎ.చిన్నారావు, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి బి.గాయత్రి, హెచ్ఎం హేమలత, డిప్యూటీ ఎంపిడిఒ రాజారావు, కార్యదర్శులు పాల్గొన్నారు.

పాఠశాలకు దాత విరాళం

సంతబొమ్మాళి: మండలం ఎం.సున్నాపల్లి ఎంపియుపి పాఠశాలకు అదే గ్రామానికి చెందిన బైపల్లి మోహనరావు రూ.10 వేలు నగదు మంగళవారం విరాళంగా అందజేశారు. ఈనెల 10న నిర్వహించనున్న మెగా పేరెంట్స్ మీటింగ్‌కు తనవంతు సహకారంగా హెచ్ఎం శాస్త్రికి అందజేశారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ సభ్యులు గీతా భారతి, సిఆర్‌పి అర్జాల తేజేశ్వర రావు, గ్రామ పెద్దలు నరసింహులు, యువకులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న మోహనరావు

ఘనంగా వైఎస్ఆర్ జయంతి



శ్రీకాకుళం సిటీ : రక్తదానం చేస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని మాజీ ఉప ముఖ్యమంత్రి, జిల్లా వైసిపి అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మంగళవారం వైఎస్ఆర్ జయంతి సందర్భంగా ఏడురోడ్ల జంక్షన్‌లో వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం రెడ్‌క్రాస్ కార్యాలయంలో రక్తదానం చేశారు. కార్యక్రమంలో యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు మెంటాడ స్వరూప్, నాయకులు మార్పు పృధ్వీ, మేడేపల్లి భరద్వాజ్, ఇలియాస్ హుస్సేన్, సుంకరి పవన్ పాల్గొన్నారు.

కాంగెస్ పార్టీ ఆధ్వర్యంలో...

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో డిసిసి అధ్యక్షులు అంబటి కృష్ణారావు, కాంగ్రెస్ నాయకులు వైఎస్ఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షులు కెవిఎల్ఎస్ ఈశ్వరి, డిసిసి ప్రధాన కార్యదర్శి సాయి దుల్లాఖాన్, జిల్లా ఎస్‌సి విభాగం అధ్యక్షులు తెంబూరు మధుసూదనరావు, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పూడి కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

పాతపట్నం: పాతపట్నంలో మాజీ సిఎం వైయస్ఆర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి నాయకులతో కలిసి నివాళ్లర్పించారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నరసన్నపేట : పట్టణంలో, ఉర్లాం, పోలాకి మండలంలో ఈదులవలస, సుసరాము, పిన్నింటిపేటలో వైఎస్ఆర్ విగ్రహానికి జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణచైతన్య పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అదేవిధంగా జలుమూరు, సారవకోట మండలంలో నిర్వహించారు.

టెక్కలి రూరల్ : టెక్కలి ఇందిరాగాంధీ జంక్షన్‌లో వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేరాడ తిలక్ వైయస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

రణస్థలం: మండల కేంద్రంలో వైఎస్ఆర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. కేకు కట్ చేశారు. ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, నాయకులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: మండలం పరశురాంపురంలో వైస్ ఎంపిపి ఎస్.ఆదినాయుడు, సర్పంచ్ తెంబూరు ప్రసాదరావు, నాయకులు వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలలు నివాళ్లర్పించారు.

కవిటి: స్థానిక బస్టాండ్ కూడలిలో వైఎస్ఆర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్, ఎమ్మెల్సీ రామారావు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్, సర్పంచ్ పూడి లక్ష్మణరావు, వైస్ ఎంపిపిలు పూడి నేతాజీ, కర్రి గోపయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: బస్‌స్టాండ్ జంక్షన్ వద్ద ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి ఎమ్మెల్సీ రామారావు, మాజీ ఎమ్మెల్యే పిరియ సాయిరాజ్, మున్సిపల్ చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి, వైస్ చైర్‌పర్సన్‌లు భారతీ దివ్య, లాభాల స్వర్ణమణి, ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి నారాయణమ్మ తదితరులు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

బూర్జ: మదనాపురం జంక్షన్ వద్ద వైఎస్ఆర్ విగ్రహానికి వైసిపి నాయకులు నివాళ్లర్పించారు. వైసిపి మండల అధ్యక్షులు కె.గోవిందరావు, కె.నాగేశ్వరరావు, సర్పంచ్‌లు బలరాం నాయుడు, వి.కృష్ణ, జడ్డు మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

లావేరు: మండలంలోని వెంకటాపురంలో వైఎస్ఆర్ విగ్రహానికి సర్పంచ్ బొంతు ఎల్లం నాయుడు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. నాయకులు పి.సూర్యారావు, లుకలాపు అప్పారావు, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

సంతబొమ్మాళి : మండలంలో జెడ్‌పిటిసి పాలవసంత రెడ్డి, మాజీ పిఎసిఎస్ చైర్మన్ జగన్, ఎంపిపి మేరుగు రాజేశ్వరి, వైసిపి మండల అధ్యక్షుడు మోహన్ రెడ్డి తదితరులు నౌపడ, సంతబొమ్మాళిలో ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలను వేసి నివాళ్లర్పించారు.

మెళియాపుట్టి: మండల కేంద్రంలో వైఎస్ఆర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి, నాయకులు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి బైపోతు ఉదయ్ కుమార్, మండల కన్వీనర్ జైమునిరావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పలాస: కాశీబుగ్గ సంత మైదానం, కాశీబుగ్గ కిడ్నీ ఆస్పత్రి ఆవరణలో మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో హనుమంతు వెంకటరావు, మాజీ ఎంపిపి బత్తిన హేమేశ్వరరావు, పట్టణ, మండల అధ్యక్షులు శిష్టు గోపి, దువ్వాడ రవి కుమార్, పాలిన శ్రీనివాసరావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సోంపేట: సోంపేటలో వైఎస్ఆర్ విగ్రహానికి జెడ్‌పిటిసి తడక యశోద, ఎంపిపి నిమ్మన దాసు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో తడక జోగారావు, ఎస్ భాస్కరరావు, ఎం వెంకటరమణ, పి కామేష్ తదితరులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా ఉన్న రాజశేఖరరెడ్డి విగ్రహానికి ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి దుక్క రోజా, నాయకులు అన్నెపు రామారావు, సంపతిరావు హేమసుందరరాజు, పేడాడ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస : వైఎస్ఆర్ జయంతి సందర్భంగా పట్టణంలోని ఫ్లై ఓవర్ దిగువన ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్ పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా అధికార ప్రతినిధి కోట గోవిందరావు, వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొడ్డేపల్లి రమేష్ కుమార్, నాయకులు తమ్మినేని చిరంజీవి నాగ్, గురుగుబిల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



రణస్థలం : కేక్ కట్ చేస్తున్న వైసిపి నాయకులు

నందిగాం: వైఎస్ఆర్ జయంతి సందర్భంగా ఎంపిపి శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టెక్కలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేరాడ తిలక్ వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి యర్ర చక్రవర్తి, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి కురమాణ బాలకృష్ణారావు, వైసిపి మండల అధ్యక్షులు తమిరి ఫాల్గుణరావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు: మండల కేంద్రంలో ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఎంపిపి సవర సావిత్రి, జెడ్‌పిటిసి కామక భాగ్యవతి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: కుశాల పురం జంక్షన్ వద్ద వైసిపి నాయకులు వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి సనపల నారాయణ రావు, వైసిపి మండల అధ్యక్షులు బోర సాయిరాం రెడ్డి, వైస్ ఎంపిపి జరుగుళ్ల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పొందూరు: పట్టణంలోని అంబేద్కర్ కూడలిలో వైఎస్ఆర్ విగ్రహానికి వైసిపి నాయకులు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్, వైసిపి మండల అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి, జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టిడిపితోనే సంక్షేమం సాధ్యం


ఇచ్ఛాపురం : మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ అశోక్

ప్రజాశక్తి- నరసన్నపేట

టిడిపితోనే సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం మంగళవారం నరసన్నపేట పట్టణంలో 7వ వార్డు పరిధిలో కలివరంపేట, తిరుమలవీధి, బొంతలవీధిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయ కర్త బగ్గు అర్చన, ఎపి కళింగ కార్పొరేషన్ చైర్మన్ రొనంకి కృష్ణం నాయుడు, క్లస్టర్ ఇన్‌ఛార్జి గొద్దు చిట్టిబాబు, యూనిట్ ఇన్‌ఛార్జి కోరాడ రాంచంద్రరావు, మాజీ ఎంపిటిసి జామి వెంకటరావు, వారణాసి మురళి, నాయకులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 6వ వార్డులో ప్రభుత్వ విప్ బెందాలం అశోక్ పాల్గొన్నారు. రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు సిఎం చంద్రబాబు ప్రయత్నాలు ప్రారంభించారన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పత్రి తవిటియ్య, రాష్ట్ర కార్యదర్శి సాలీన ఢిల్లీ, సాధికారిత సమితి కన్వీనర్ కొండ శంకర్ రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి నందిగాం కోటి, క్లస్టర్ ఇన్‌ఛార్జి లీలారాణి, మాజీ అధ్యక్షులు కాళ్ల ధర్మారావు, కాళ్ల దిలీప్ కుమార్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

సరుబుజ్జిలి: మండలంలోని పాలవలస గ్రామంలో నిర్వహించిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే కూన రవికుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏడాది పాలనపై ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు తాడి బోయిన చంద్రశేఖర్ యాదవ్, డిసిసిబి చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ, ఎంపిడిఒ పావని, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

లావేరు: మండలంలోని గుమ్మడాం పంచాయతీలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఇంటింటికి వెళ్లి ప్రజలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్, మధుబాబు, మాజీ ఎఎంసి చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, మజ్జి రామూర్తి, జిల్లా మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి పాల్గొన్నారు.


నరసన్నపేట : ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి

పలాస : పలాస, కాశీబుగ్గ మున్సిపాలిటీ కొత్త పారసంబలో తొలిఅడుగు కార్యక్రమంలో ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు పాల్గొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి లోడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, పట్టణ అధ్యక్షులు బడ్డ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతోనే మానవ మనుగడ

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మంగళవారం ఉపాధిహామీ పథకం ద్వారా మంజూరు చేసిన వివిధ రకాల పండ్ల మొక్కలను మండలంలోని పెద్దపాలెం, పాలవలస గ్రామాల్లో ఎమ్మెల్యే రవికుమార్ నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకు పెరిగిపోతున్న కాలుష్యం నుంచి ప్రజలను కాపాడడానికి మొక్కలు నాటడం ప్రతిఒక్కరూ దినచర్యగా మార్చుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మానవ మనుగడ భవిష్యత్ తరాలకు ఎంతో ఉపయోగకరంగా ఉండాలన్న ఆలోచనతో ప్రతి ఏడాది మొక్కల పెంపకానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎం.పావని, ఇసి రమాదేవి, డిసిసిబి చైర్మన్ శివ్వాల సూర్య నారాయణ, కరణం రాజబాబు, తాడేల రాజారావు, రాంబాబు, జనసేన అధ్యక్షులు పైడి మురళి పాల్గొన్నారు.

నరసన్నపేట: ఉద్యానవన పంటలకు ప్రాధాన్యత కల్పిస్తూ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని


సరుబుజ్జిలి : మొక్కను నాటుతున్న ఎమ్మెల్యే రవికుమార్

ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మండలం దేవాది పంచాయితీలో వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా ఉపాధిహామీ ద్వారా చేపడుతున్న కొబ్బరి మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మూడు సంవత్సరాల పాటు ఎకరాకు రూ.40 వేలు రైతులకు అందిస్తున్నామని, మొక్కలు కూడా ఉచితంగానే పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, టిడిపి మండల అధ్యక్షులు శిమ్మ చంద్రశేఖర్, యాళ్ల వేణుగోపాలరావు, శిమ్మ జగన్నాథం, ముద్దాడ అప్పలనాయుడు, ధర్మాన అసిరినాయుడు, దుంగ గంగరాజు, రఘునాథ్, గొండు సూర్యరావు, ఎంపిడిఒ ప్రసాదరావు, సిబ్బంది, సచివాలయ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: ఉపాధిహామీ పథకంలో భాగంగా కొండవూరు పంచాయతీలో వనమహోత్సవ కార్యక్రమాన్ని తెలుగు యువత ప్రధాన కార్యదర్శి కె.కిరణ్‌కుమార్ ప్రారంభించారు. టిడిపి మండల అధ్యక్షులు లండ సురేష్, పలాస నియోజకవర్గం తెలుగు యువత ప్రధాన కార్యదర్శి ధనరాజ్ యదవ్, ఎంపిటిసి చిట్టిబాబు, మాజీ అధ్యక్షుడు అప్పలరాజు, కోశాధికారి కూర్మారావు నాయుడు, వార్డు మెంబర్లు, ఫీల్డ్ అసిస్టెంట్, రైతులు పాల్గొన్నారు.

బూర్జ: ఎన్ఆర్ఈజీఎస్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఎంపిడిఒ తిరుపతిరావు పాల్గొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సుస్మిత, ఎపిఒ రవికుమార్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణ నాయుడు, ఎన్ఆర్ఐ బిసిసెల్ అధ్యక్షుడు వ్యాపారి వెంకటేష్, సర్పంచ్ వేగు అనురాధ, ఎంపిటిసి చొక్కర పోలినాయుడు, కార్యదర్శిలు బలివాడ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

టిడిపిలో గుర్తింపు లేదు

రాష్ట్ర ఎస్‌సి సెల్ కార్యదర్శి ఆదినారాయణ

ప్రజాశక్తి- రణస్థలం


ఆదినారాయణ

టిడిపిలో కష్టపడి పనిచేసే వారికి గుర్తింపు లేదని రాష్ట్ర ఎస్.సిసెల్ కార్యదర్శి ముక్కు ఆదినారాయణ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎస్‌సి సామాజిక తరగతికి ఇవ్వాలని పార్టీ రిజర్వేషన్ కల్పించిందని అయితే అన్ని అర్హతలు ఉన్న తనకు ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఇవ్వడానికి నిరాకరిస్తున్నారని అందుకు నిరసనగా రాష్ట్ర ఎస్‌సి సెల్ కార్యదర్శి పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు గెలుపు మొదలు సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, జెడ్‌పిటిసిలు, వార్డు మెంబర్లు గెలుపువరకూ సొంత డబ్బులు ఖర్చు పెట్టి కష్టపడిన పనిచేసిన వ్యక్తులకు పార్టీ ఇచ్చిన గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు.

పశుగ్రాస పెంపకంపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి- పాతపట్నం

పాడి రైతులు పశుగ్రాసంపై దృష్టి పెట్టి తద్వారా పాడి పరిశ్రమ లాభసాటిగా ఉండేలా చేసుకోవాలని ప్రాంతీయ వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ మంచు కరుణాకరరావు అన్నారు. మండలంలో సీదిలో మంగళవారం పాడి రైతులకు పశుగ్రాస పెంపకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 7 నుంచి 14 వరకు జరుగుతున్న పశుగ్రాస వారోత్సవాల్లో పాడి రైతుకు పశుగ్రాస పెంపకంపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. పాడి రైతు తనకున్న భూమిలో కనీసం 10వ వంతు పశుగ్రాసానికి కేటాయించాలన్నారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది గుణాలమ్మ, యశ్వంత్, రామ్మోహన్, శ్యాంసుందర్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

లావేరు: పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా మండలం గురుగుబిల్లిలో పశు సంవవర్ధక శాఖ, డా. రెడ్డీస్ ఫౌండేషన్ సంయుక్తంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పశు సంవవర్ధక శాఖ ఎడి, రెడ్డీస్ ఫౌండేషన్ డిప్యూటీ మేనేజర్ డా. హరిబాబు, సీనియర్ ఏరియా మేనేజర్ పి.తవిటి నాయుడు, రెడ్డీస్ ఫౌండేషన్ సమన్వయ కర్తలు కృష్ణ, సాయి, అనిల్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

రైతులకు కొబ్బరి మొక్కల పంపిణీ

ప్రజాశక్తి - పొందూరు

మండలంలోని కేశవదాసుపురంలో ఉపాధి హామీలో భాగంగా టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు, మాజీ సర్పంచ్ గాడు నారాయణరావు చేతుల మీదుగా రైతులకు కొబ్బరి మొక్కలను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ పొలాల్లో, గట్లపై కొబ్బరి మొక్కలను నాటి పెంచడం ద్వారా అదనపు ఆదాయాన్ని సంపాదించవచ్చన్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వ్యవసాయ పద్ధతులపై అవగాహన

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మండలం రఘునాధపురం రైతుసేవా కేంద్రం పరిధిలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు వ్యవసాయ పద్ధతులు, ఎరువులు, విత్తనాల వినియోగం తదితర అంశాలపై రైతులకు టెక్కలి వ్యవసాయశాఖ అధికారి ఎన్.శ్రీనువాసరావు అవగాహన కల్పించారు. పచ్చిరొట్టె ఎరువుల ఉపయోగాలు, తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు, వరి తెగుళ్ల నివారణపై అవగాహన కల్పించారు. కాలిబాటలు తీయడం వలన కలిగే లాభాలు పంటల భీమా అవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో రుప్ప రమ్య, రైతులు దుర్గారావు, కొండలరావు, నారాయణ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కవిటి: పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బొరివంకలో వివిధ నారుమడులను ఎఒ శ్రీదేవి సందర్శించారు. వర్షాకాల ప్రారంభంలో సాధారణంగా వచ్చే సూక్ష్మ పోషక లోపాలను రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపిఇఒ లలిత, విహెచ్ఎ సంతోష్ కుమార్, రైతులు బల్లెడ జయప్రకాష్, లోళ్ల కింగ్, బెందాలం రాంబాబు, లోళ్ల రామకృష్ణ, లోళ్ల రాము తదితరులు పాల్గొన్నారు.

నందిగాం: మండలంలోని శివరాంపురం, సైలాడ గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎరువులు, యాజమాన్య పద్ధతులు, బీమా, సాగుహక్కు పత్రాలు, అన్నదాత సుఖీభవ వంటివి వివరించారు. కార్యక్రమంలో ఎఒ పి.శ్రీకాంత్ పాల్గొన్నారు.

సోంపేట: సోంపేట మండలం పోత్రకొండ, కర్తలపాలెంలో పొలంబడి కార్యక్రమంలో భాగంగా సహాయ వ్యవసాయ సంచాలకులు టి.భవానీ శంకరరావు రైతులతో కలిసి మండల ఎఒ నరసింహమూర్తి ఆధ్వర్యంలో క్షేత్ర సందర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బేసి ఖగేశ్వరరావు, పొందూరు గున్నయ్య, సోమేష్, బురద విశ్వనాథం, యాదవరావు, ధర్మారావు, గార షణ్ముఖరావు, వ్యవసాయ సహాయకులు ఉష, కుమారి పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: పంటలు ప్రస్తుత పరిస్థితులపై



కవిటి : అవగాహన కల్పిస్తున్న ఎఒ శ్రీదేవి

తీసుకోవాల్సిన జాగ్రత్తలను వ్యవసాయ అధికారి అజయ్ కుమార్ అవగాహన కల్పించారు. మండలంలో కొఠారి, బూర్జపాడులో రైతులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పి.పి.వి.వి. అజయ్ కుమార్, విఎఎ సునీత, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ భవాని శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: అన్ని రైతుసేవా కేంద్రాల్లో ఎరువులు సిద్ధంగా ఉన్నాయని టెక్కలి వ్యవసాయశాఖ ఎడి కె.జగన్మోహన్‌రావు అన్నారు. మండలంలోని చిట్టేవలసలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖాధికారి ఎస్.గోవిందరావు, విఎఎ టి.లావణ్య, రైతులు పాల్గొన్నారు.

వైద్యశిబిరానికి స్పందన


టెక్కలి రూరల్: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో మంగళవారం ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమం మోణింగి వారి వీధిలో ఉన్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డి.సురేష్, జి.సాయి కిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థుల ఎత్తు, బరువు, హిమోగ్లోబిన్ శాతం, రక్త గ్రూపింగ్ పరీక్షలు నిర్వహించారు. వైద్య పరీక్షల అనంతరం అవసరమైన మందులు విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు సురేష్ మాట్లాడుతూ 15 నుంచి 17 సంవత్సరాల మధ్య వయసులో ఉన్న ఆడపిల్లల్లో హిమోగ్లోబిన్ శాతం తక్కువగా ఉండటం సహజమేనని తగిన పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండొచ్చని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి. శ్యాంసుందర్, అధ్యాపకులు రేవతి, పద్మ, పుష్ప, పెంటయ్య, వైద్య సిబ్బంది వరుణ్ కుమార్, భూలక్ష్మి, నాగజ్యోతి, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

టెక్కలిరూరల్ : వర్షాకాలం వ్యాధులను ప్రబలకుండా వేడి పదార్థాలను తీసుకోవాలని లింగాలవలస పిహెచ్ సి డాక్టర్ భాగ్యశ్రీ అన్నారు. ఆదిఆంధ్రవీధిలోఉన్న ట్రైబుల్ వెల్ఫేర్ వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థుల చేతులు శుభ్రంగా కడుక్కోవాలని, వేడినీరు తాగాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈమెతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.


ఆమదాలవలస : వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది


ఆర్థిక సహాయం అందజేస్తున్న ఎస్‌పి మహేశ్వరరెడ్డి

హోంగార్డుకు ఆర్థిక సహాయం

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

జిల్లా పోలీసు శాఖలో హోంగార్డుగా పనిచేసి, ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన పి.జగన్నాథంకు చేయూతను అందించేందుకు తోటి సిబ్బంది విరాళంగా ఇచ్చిన ఒక్క రోజు డ్యూటీ అలవెన్సు రూ.4.09 లక్షల చెక్కును ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం అందజేశారు. ఉద్యోగ విరమణ అనంతరం ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని ఎస్‌పి ఆకాంక్షించారు. కార్యక్రమంలో పరిపాలనా అధికారి సిహెచ్.గోపీనాథ్, హోంగార్డు ఆర్ఎస్ఐ వెంకటరమణ పాల్గొన్నారు.

మహిళల రక్షణపై అవగాహన

ప్రజాశక్తి- సోంపేట

సమాజంలో మహిళలు, బాలికలపై జరుగుతున్న లైంగిక దాడులు, వేధింపుల నుంచి రక్షణ పొందేందుకు అమల్లో ఉన్న చట్టాలను ఎస్ఐ లవరాజు విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్థానిక బాలిక ఉన్నత పాఠశాలలో మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వేధింపుల నుంచి రక్షణ పొందేందుకు ఏం చేయాలో విద్యార్థులకు సూచించారు. శక్తియాప్ వినియోగంపై తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దృష్టి లోపం ఉన్నవారికి అండగా..

ప్రజాశక్తి- కవిటి

వైఎస్ఆర్ జయంతి సందర్భంగా సీడాప్ మాజీ చైర్మన్ శ్యాం ప్రసాద్ రెడ్డి తన ఉదారత చాటుకున్నారు. మండలంలో దృష్టిలోపంతో బాధపడుతున్న డిజి పుట్టుగకు చెందిన నౌపడ భాస్కరరావు, కపాసుకుద్దికి చెందిన కార్తీక్, లక్కవరం గ్రామానికి చెందిన ధర్మరాజుకు స్మార్ట్ మొబిలిటీ స్పెన్సర్ డివైస్‌లను అందించారు. ఈ సందర్భంగా స్థానికులు ఆయన్ని అభినందించారు.

మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు, పలాస

మండలంలోని అమలపాడుకు చెందిన డి.కె అప్పారావు ఇటీవల రైలు ప్రమాదంలో మృతి చెందడంతో ఆయన కుటుంబానికి గ్రామస్తులు, గల్ఫ్ కార్మికులు కలిసి రూ.1,98,450 ఆర్థికసాయాన్ని అందించారు. అమలపాడులో మృతుని ఇంటికి వెళ్లి అతని భార్య సంధ్య, ఇద్దరు చిన్నారులకు మంగళవారం నగదు సహాయాన్ని అందించారు. మరింత మంది దాతలు ముందుకు వచ్చి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని గల్ఫ్ కార్మికులు కోరారు. కార్యక్రమంలో గల్ఫ్ కార్మికులు, మహిళలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పలాస మండలం కైజోలకు చెందిన బుడత దామోదర్ కుటుంబానికి పోలాండ్ దేశంలో పనిచేస్తున్న శ్రీకాకుళం తెలుగు సంఘం సభ్యులు రూ.1.25 లక్షల ఆర్థికసాయం అందజేశారు. బుడత దామోదర్ పోలాండ్‌లో పనులు చేసేందుకు వెళ్ళి మృతి చెందగా, ఆ దేశంలో వలస కూలీలుగా పనిచేస్తున్న కార్మికులు విరాళాలు సేకరించి ఆర్థికసాయం చేశారు.